క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్వామివారి తిరువీధి



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, సర్పంచ్ రామారావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) పునరావాస కాలనీలో సంతోషి మాత, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు అధ్యక్షతన వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



రిషిత సాయికి మెమెంటో అందిస్తున్న యోగా ట్రస్టు ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్‌కు చెందిన శ్రీజ్ఞానజ్యోతి స్కూల్‌కు చెందిన విద్యార్థిని రిషిత సాయి రాష్ట్ర స్థాయిలో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపింది. రాష్ట్ర స్థాయిలో నాల్గో స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానం పొందినట్లు వివేకానంద యోగా ట్రస్టు సభ్యులు సదాశివుని రవి గురువారం తెలిపారు. ఈ మేరకు రిషిత సాయికి ట్రస్టు సభ్యులు రవి, యోగా టీచర్ సుప్రిజ, టీటీడీ అన్నమయ్య ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ సంతోషి తదితరులు మెమెంటోను, నగదు బహుమతిని అందించారు. రిషిత సాయికి స్కూల్ యాజమాన్య ప్రతినిధులు రామారావు, భాస్కరరావు అభినందించారు.

అక్రమ నిర్మాణం పరిశీలన



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ మాకివలస గ్రామంలో మురుగు నీటి కాలువపై నిర్మించిన మరుగుదొడ్డిని తొలగించాలని సంబంధిత వ్యక్తికి ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా సూచించారు. జాతీయ రహదారి 326–ఎ నుంచి కోదడ్డపనసకు వెళ్లే మార్గానికి పక్కనే ఉన్న మలుపు దగ్గర ఈ మరుగుదొడ్డి నిర్మించడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. మరుగుదొడ్డిని తొలగించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణదారుడికి నోటీసులు అందించాలని పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌కు సూచించారు.

రూ.78 వేల ఆర్థికసాయం అందజేత



రమాదేవికి నగదు అందజేస్తున్న కళింగకోమట్ల సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక పాత స్టేట్‌బ్యాంక్ వీధికి చెందిన కింతలి జీవన్ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. మృతుని భార్య రమాదేవికి కళింగ కోమటి సంఘం ప్రతినిధులు రూ.78 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, నరసన్నపేట సంఘం అధ్యక్షుడు ఊణ్న వెంకటేశ్వరరావు, యువజన విభాగం ప్రతినిధులు బోయిన బాలకృష్ణ, పొట్నూరు సాయి, కేశవరాజు, ఊణ్న రంగనాథ్, పి.రమేష్, సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పరీక్షలపై భయం వీడాలి



ఆర్ఐఓను సన్మానిస్తున్న అధ్యాపకులు

బూర్జ: పరీక్షలపై విద్యార్థులు భయం విడనాడాలని ఆర్ఐఓ, బూర్జ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివ్వాల తవిటినాయుడు అన్నారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 2వ వారం నుంచి జరగనున్న సందర్భంగా బూర్జ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు ఇచ్చారు. విద్య గొప్ప తనం, స్వయం కృషి, పట్టుదల గురించి తెలియజేశారు. శ్రీకాకుళం ఉపనిషత్ మందిరం నుంచి ఎస్.ఎం.ఎం.నర్సింహమూర్తి, రిటైర్డ్ అధ్యాపకులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహసారథులే గెలుపు వారధులు



జలుమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ప్రతి ఇంటికీ సంక్షేమం పథకాలు తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

జలుమూరు: గృహసారథులే రానున్న ఎన్నికల్లో విజయ సారథులని, మీపై గురుతర బాధ్యత ఉందని, ప్రతి ఇంటికీ పార్టీలకు అతీతంగా సంక్షేమం అందించడమే లక్ష్యం కావాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం చల్లవానిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం..అభివృద్ధి రెండూ పరుగులు పెడుతున్నాయన్నారు. నూతన విద్యా విధానం, మన బడి – నాడు–నేడు ద్వారా ఎంతో ప్రగతి సాధించామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వంశధార నీటి సమస్యలను ఒడిశా ముఖ్యమంత్రితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్చలు జరిపారన్నారు. వంశధార సమస్య తీరితే లక్షలాది ఎకరాలకు సాగు నీరు అంది జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు.

రాష్ట్రంలో ఇల్లు లేని వ్యక్తి చంద్రబాబు

మన రాష్ట్రంలో ఇల్లు లేని వ్యక్తి చంద్రబాబు అని, రాష్ట్రానికి సుమారు 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి ఎక్కడో హైదరాబాద్ (ఇతర రాష్ట్రంలో) తలదాచుకుని ప్రజా సమస్యలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు పి.ముసలినాయుడు, పి.రాజప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, కో కన్వీనర్ పైడి విఠలరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శ్యామలరావు, బుక్కా లక్ష్మణరావు, విజయ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

పాతపట్నం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జగనన్న సైన్యంలా పని చేసి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని మరోమారు అధికారంలోకి తేవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. పాతపట్నంలోని బ్రాహ్మణవీధి కూడలిలో ఉన్న కేఎస్ఎం ప్లాజాలో గురువారం సాయంత్రం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పని చేయాలన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా సిఫార్సు పొందినవారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జగనన్న పాలనలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటివద్దకే చేరుతున్నాయన్నారు. మార్చి 18వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌లను వలంటీర్‌లతో కలిసి అతికించాలన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్‌ఎంపీపీ ఎస్.ప్రదీప్, గేదెల సూర్యం, మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, రామకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాతయ్య, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, పార్టీ నాయకులు పనుకు మోహన్, ప్రహల్లాద పుల్లాయ్, చీకటి పద్మరాజు, టి.సుధాకర్, జి.రాము, శ్రీధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పాతపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



ఏర్పాట్లను ప్రారంభిస్తున్న ఆర్డీఓ శాంతి

జలుమూరు: ఈ నెల 18 నుంచి 20 వరకు శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి అన్నారు. గురువారం క్యూలు, బారికేడ్లు, స్వామివారిని వంశధార నదికి (త్రిశూల్) చక్రతీర్థస్నానాలకు తీసుకువెళ్లే రహదారి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. వీఐపీలు దర్శనాలు ఎలా నిర్వహిస్తున్నారని పోలీస్‌లను అడిగి తెలుసుకున్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ పారినాయుడు మాట్లాడుతు దక్షిణ ద్వారం వద్ద ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. సమస్యలు లేకుండా అంతా సజావుగా జరిగేలా చూడాలని ఆర్డీఓ సూచించారు. తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీఓ జి.వి.రవి కుమార్, సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, ఈఓ పి.ప్రభాకరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీరామ్మూర్తి

ఆమదాలవలస రూరల్: మండలంలో మండాది గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతిచెందడం బాధాకరమని మండల ప్రత్యేకాహ్వానితుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మృతుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఎక్స్‌గ్రేషియా అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన నాయకులు బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. స్పీకర్ తనయుడికి వివాహం జరిగిన ఆరు నెలలు పూర్తికానందున సంఘటన స్థలానికి రాలేకపోయారని తెలియజేశారు. స్పీకర్ సూచనల మేరకు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పామన్నారు. వివిధ గ్రామాల్లో సేకరించిన ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులను మృతుల కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు ఉన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి



పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ యోగీశ్వరి, గ్రామస్తులు

ఎల్.ఎన్.పేట: ప్రతీ విద్యార్థి గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని తురకపేట సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి అన్నారు. తురకపేటలో శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అభయాంజనేయ పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని (బుక్ డిపో) గురువారం ప్రారంభించారు. విద్యార్థులతోపాటు అన్నివర్గాల వారు ఖాళీ సమయంలో గ్రంథాయానికి వచ్చి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామానికి చెందిన కంచరాన దినేష్, చింతాడ అర్జునుడుతోపాటు పలువురు గ్రంథాలయానికి పలు రకాల విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను నిర్వాహకుడు చింతాడ శ్రీనివాసరావుకు అందజేశారు.

చేయూత..



ఆర్థికసహాయం అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

సారవకోట: మండలంలోని చోడసముద్రం గ్రామానికి చెందిన సూరపు సింహాచలంకు సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సింహాచలం ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సహాయం అందజేసిన వారిలో పూర్వ విద్యార్థులు చింతు గోవిందరావు, మురళి, ఆనందరావు, ఈశ్వరరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం భవనానికి భూమిపూజ



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని కుమ్మరి సంఘానికి సొంత భవనం నిర్మించుకునేందుకు అదే వీధిలో స్థలాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో సమకూరింది. సంఘ భవనం నిర్మాణానికి సర్పంచ్ బూరల్లి శంకర్ గురువారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పి.ప్రసాద్, కుమ్మరి సంఘం ప్రతినిధి రాయిల మల్లేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, దండి జయప్రకాష్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు: ఎరువుల దుకాణదారులు, డీలర్లు సబంధిత రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పలాస వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు, కొత్తూరు మండల తనిఖీ అధికారి లింగాల వెంకట మధు అన్నారు. కొత్తూరు మండలంలోని మెట్టూరు, కొత్తూరు, బలద, నివగాంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం పరిశీలించారు. ఎరువులు గొడౌన్‌లు, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రికార్డుల నిర్వహణ, నిల్వలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తూరు ఏడీ బొడ్డేపల్లి రాజగోపాలరావు, ఏఓ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

ఔదార్యం..



కృష్ణారావుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్‌లు

కొత్తూరు: మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు తోటి సర్పంచ్‌కు ఆర్థిక సహాయం చేసి తమ ఔదార్యాన్ని చాటుకునారు. అడ్డంగి సర్పంచ్ సవర కృష్ణారావు క్యాన్సర్‌తో కొంత కాలం నుంచి బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, గురండ సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు, ఆకులతంపర సర్పంచ్ నాగ్ల అప్పన్న, సోమరాజపురం సర్పంచ్ శిమ్మ మధుసూదనరావు కలిసి రూ.20 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం అందజేశారు. కృష్ణారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్‌లకు కృష్ణారావు, భార్య సుసీకు (ఎంపీటీసీ సభ్యురాలు) కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచాల రాంబాబు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం

హిరమండలం: రానున్న రోజుల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల మరింత బలోపేతం కానున్నాయని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ కుప్పిలి వరప్రసాదరావు అన్నారు. గురువారం నాబార్డు ఆధ్వర్యంలో హిరమండలంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. ఉత్పత్తిదారుల సంఘాల్లో రైతులు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాబార్డు ద్వారా అందిస్తున్న కార్యక్రమాలపై బ్యాంకర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీజీఎం సత్యనారాయణ మాట్లాడుతూ సంఘాలకు ఉమ్మడి జవాబుదారీ బృందాలు, వర్కింగ్ క్యాపిటల్, ఇతర రూపాలలో రుణ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ అధ్యక్షుడు యు.ప్రసాద్, ఆర్ట్స్ డైరెక్టర్ ఎన్.అనూప్, బ్రెడ్స్ కార్యదర్శి వి.సాంబమూర్తి, సీఏపీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ రేగిడి లక్ష్మి

పొందూరు: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో కేవీఆర్ థియేటర్ సమీపంలో ఉన్న సోషల్ క్లబ్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయవద్దని సర్పంచ్ రేగిడి లక్ష్మి రిజిస్ట్రార్ జె.కనకరత్నంకు గురువారం వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీకి చెందిన ఆస్తి అయినప్పటికీ కొంత మంది క్రయ విక్రయాలు చేసేందుకు ముందుకు వస్తున్నారని సర్పంచ్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఆస్తులను కాపాడటంలో తమకు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మధుకేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఏకాదశి పురస్కరించుకుని గురువారం ఘనంగా నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహించి భక్తులు హారతులిచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 4,259 మంది ఓటర్లు

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 4259 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఎ.సింహాచలం గురువారం తెలిపారు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో మూడు కేంద్రాలు, పోలాకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు, జలుమూరులోని కస్తూర్బా స్కూల్‌లో ఒక కేంద్రం, సారవకోట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

22న ఇంటర్వ్యూలు

సరుబుజ్జిలి: ఈ నెల 22న ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్ఐఎస్ కంపెనికి సంబంధించిన సెక్యూరిటీ గార్డుల ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది, మంచి దేహధారుఢ్యం ఉన్నవారు అర్హులన్నారు. పదో తరగతి మార్కులు జాబితా, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరుకావాలన్నారు.

వీధి దీపాలు వేయాలి

పాతపట్నం: పంచాయతీలోని దుర్గమ్మగుడి శివారున ఉన్న గాంధీనగర్‌లో గత కొద్ది రోజులుగా వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ మెరకు గురువారం గ్రామ పంచాయతీ అసిస్టెంట్‌కు వీధిలైట్లు వేయాలని అర్జీ అందజేశారు. శివారు ప్రాంతం కావడంతో రాత్రి సమయంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



విద్యార్థులకు బహుమతులు అందస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: విద్యార్థి దశ నుంచే కష్టపడేతత్వం అలవాటు చేసుకోవాలని, ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం కరవంజ మోడల్ స్కూల్‌లో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులు నవ్యశ్రీ (బైపీసీ 98 శాతం), శ్యామలరావు (91 శాతం) హిమబిందు (సీఈసీ 90 శాతం), కృష్ణవేణి (ఎమ్ఈసీ 93 శాతం) సాధించిన విద్యార్థులకు తన సొంత నిధుల నుంచి రూ.ఎనిమిది వేలు అందించారు. మెజిషియన్ సాగర్ పలు ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు సినీ గీతాలకు చేసిన నృత్యాలు అలరించాయి. ఎంపీపీ వాన గోపి, ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, సర్పంచ్ జుత్తు నేతాజీ, సీనియర్ అధ్యాపకులు గుంట లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తర్ర జీవరత్నం, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ తల్లి సంబరాలు



దుర్గమ్మ తల్లికి ముర్రాటలు సమర్పిస్తున్న మహిళలు

నరసన్నపేట: గుండవల్లిపేటలో దుర్గమ్మ తల్లి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి ముందు వచ్చే గురువారం నాడు సంబరాలు చేయడం గ్రామస్తులకు ఆనవాయితీగా వస్తుంది. దుర్గమ్మకు మహిళలు ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆ అవశేషాలు ఎవరివో?



అవశేషాలను పరిశీలిస్తున్న బత్తిలి ఎస్ఐ అమ్మన్నరావు

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కొరమ గ్రామం సమీపంలో లభించిన ఓ మహిళ అవశేషాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తూరు మండలం మెట్టూరు బిట్–2 గ్రామానికి చెందిన పొడ్డిన రజిత అనే వివాహిత గత ఏడాది డిసెంబర్ 31న భామిని మండలం పెద్దదిమిలిలోని బంధువులు ఇంటికి బయలుదేరి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త గోపినాయుడు కొత్తూరు పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.గోవింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిమిత్తం సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించగా.. ఇంటి నుంచి బయలుదేరినప్పుడు రజిత ధరించిన చీర, జాకెట్లను పోలి ఉన్న చీర, జాకెట్ కొరమ గ్రామ సమీపంలో లభ్యమయ్యాయి. వీటితో పాటు పుర్రె, ఎముకలు లభ్యం కావడంతో బత్తిలి ఎస్ఐ అమ్మన్నరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రజిత కుటుంబ సభ్యులను ఘటనా స్థలానికి పిలిపించారు. రజితకు సంబంధించిన దుస్తులే అని కుటుంబ సభ్యులు చెప్పినట్లు తెలిసింది. అయితే భర్త గోపినాయుడు మాత్రం తన భార్య పది రోజుల క్రితం బావమరిదితో ఫోన్‌లో మాట్లాడిందని చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ ఎం.గోవిందరావు వద్ద ప్రస్తావించగా బత్తిలి పోలీసులకు లభించిన అవశేషాలకు, రజిత మిస్సింగ్ కేసుకు సంబంధం లేదని చెప్పారు.

జవహర్ నవోదయలో యువ టూరిజం క్లబ్



యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

సరుబుజ్జిలి: జిల్లాలో వందకుపైగా ఆకర్షనీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉన్నత పాఠశాలల స్థాయిలో నవోదయలో మొట్టమొదటిగా యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో అన్ని పాఠశాలల్లోనూ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షించాలంటే పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టూరిజం కౌన్సిల్ మెంబర్ గీతాశ్రీకాంత్, నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త ఎస్.ఉజ్వల్, విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కూరగాయలను పరిశీలిస్తున్న ఏపీసీ జయప్రకాశ్

జలుమూరు: పదో తరగతితో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎస్ఎస్ఏ ఏపీసీ రోణంకి జయప్రకాశ్ అన్నారు. గురువారం జలుమూరు కేజీబీవీని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ముందుగా భోజనాలకు వినియోగిస్తున్న కాయగూరలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రత్యేక తరగతులకు తీసుకున్న చర్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాజరును పరిశీలించారు. ఎస్ఓ శారద, సిబ్బంది పాల్గొన్నారు.